మీర్‌పేటలో మహిళలకు జాబ్‌మేళా

బడంగ్‌పేట, సెప్టెంబర్ 12 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో గురువారం మహిళలకు జాబ్‌మేళా నిర్వహించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫాక్స్‌కాన్ కంపెనీ వారితో మాట్లాడి ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేయించారు. మహిళలకు వయసుతో పనిలేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించిన మేరకు కంపెనీ వారు 30 ఏండ్ల మహిళల కోసం జాబ్‌మేళా నిర్వహించారు. మేళాకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మహిళలు ఉద్యోగం పొంది ఆర్థికంగా కుటుంబానికి చేయూత అందించాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సునితాబాల్‌రాజ్, మహిళా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, లక్ష్మణ్ ముదిరాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ఎంసీఏ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12: ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీడీఈ) (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు గమనించాలని ఆయన సూచించారు.

పండుగల వేళ.. పటిష్ట బందోబస్తు చేపట్టాలి

- **పోలీస్ అధికారులకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశం**

సైదాబాద్, సెప్టెంబర్ 12 : పాతబస్తీలో అత్యంత సున్నిత ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం, మిలాద్ ఉల్ నబీ ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం సైదాబాద్‌లోని సౌత్‌ఈస్ట్ జోన్ కార్యాయలంలో జోన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంట పండుగల నేపథ్యంలో సున్నితమైన ప్రాంతాల్లో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ధైర్యంగా పనిచేయాలన్నారు. కమ్యూనల్ రౌడీలు, రౌడీషీటర్లు, సంఘ విద్రోహ శక్తులపై నిఘా ఉంచాలన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి బైండోవర్ చేయాలని అదేశించారు. పోలీసులు స్వీయ ప్రేరణతో తమ పనులను చేయడంలో దృఢంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో ఏవైనా అవరోధాలు ఎదురైతే మీ వెంట.. నేనుంటానని పోలీసులకు సీపీ ఆనంద్ భరోసా కల్పించారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఇటీవల జరిగన సంఘటనలపై ఉన్నతాధికారులకు వివరించారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపు సజావుగా సాగడానికి క్షేత్రసాయిలో ఉన్న ఇబ్బందులను తెలియజేశారు. వినాయక విగ్రహాల ఎత్తుకు తగ్గట్టుగా నిర్దేశిత మార్గాల్లో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీపీ పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పటేల్ కాంతిలాల్ సుభాష్, అడిషనల్ డీసీపీ బాలస్వామి, ట్రాఫిక్ డీసీపీ ఎన్. అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ అండే శ్రీనివాసరావు, సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్ననాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లోని సౌత్‌ఈస్ట్ కార్యాయలంలో పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పటేల్ కాంతిలాల్ సుభాష్ తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- **హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య**
- **నాగోల్‌లో ఉప్పల్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం**

కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య, పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, సెప్టెంబర్ 12: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశ ప్రతిష్టను పెంపొందించాలని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప్పల్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని పేర్కొన్నారు. నాగోల్ జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులతో కూడిన నోసా సహకారం ఎంతో ఉందని.. వారి కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పద్మావతి, ఎంఈఓ రామారావు, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కన్నాగౌడ్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, లింగంగౌడ్, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టను దిగజార్చేలా 'రాహుల్' వ్యాఖ్యలు

- **బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి**

ఎల్బీనగర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 12: అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ దేశ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం బాధాకరమని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. గురువారం ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల నుంచి ప్రధాని నరేంద్రమోదీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక రాహుల్‌గాంధీ ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే రీతిలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, నాయకులు వనెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై వ్యాసరచన పోటీలు

అబిడ్స్, సెప్టెంబర్ 12: చిన్నారులకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించాలని ఎస్ఎస్‌కే సమాజ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నగరి లక్ష్మీ నారాయణ్ పేర్కొన్నారు. గురువారం సమాజ్‌లో చిన్నారులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.

సజావుగా ముగిసిన టీజీ సెట్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్-2024 పరీక్షలు గురువారంతో ముగిశాయి. రోజూ రెండు సెషన్లలో మూడు రోజులపాటు ఈ పరీక్షలను నిర్వహించారు. చివరిరోజు పరీక్షాపత్రం కీ పాస్‌వర్డ్‌ను ఓయూ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి తెలిపారు. చివరి రోజు మొదటి సెషన్‌లో 79.05 శాతం, రెండో సెషన్‌లో 79 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని వివరించారు.

లయన్స్ క్లబ్ బలోపేతానికి కృషి చేయాలి

కందుకూరు నూతన అధ్యక్షుడు విఠల్‌రెడ్డితో ప్రమాణం చేయిస్తున్న లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ తదితరులు

కందుకూరు, సెప్టెంబర్ 12 : కందుకూరు లయన్స్ క్లబ్ బలోపేతానికి కృషి చేయాలని క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ లయన్ రాధాకృష్ణ, జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. కందుకూరు లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా సురుసాని విఠల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తాతో వారు ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ పేదల సంక్షేమానికి పాటుపడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. క్లబ్ ఉన్నతస్థాయికి చేరేలా సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మహేంద్రకుమార్‌రెడ్డి జిల్లా గవర్నర్‌గా ఎదగడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి,బుచ్చయ్య, ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ మండలాధ్యక్షుడు తాళ్ల అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, కిరణ్‌గుప్తా, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కందుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీడీఓ సరిత, అంగన్‌వాడీ టీచర్లు

కందుకూరు, సెప్టెంబర్ 12 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీడీఓ సరిత అన్నారు. మండల కేంద్రంలోని సమావేశపు హాల్‌లో జాతీయ పోషకాహార ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. స్థానికంగా లభించే తృణ ధాన్యాలు, పప్పు దినుసులు, ఆకు కూరలతో వివిధ రకాల వంటలను తయారు చేసి పుడ్‌స్టాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు ఐరన్ లోపంతో రక్తహీనత సమస్యలు వస్తాయని, కిశోర బాలికలు ఐరన్ లోపం లేకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీ బిడ్డా క్షేమంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పీఎచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, శ్రీలత, వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన

మామిడిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ పవన్‌యాదవ్ తదితరులు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 12 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మామిడిపల్లి 12వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న అవయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

సైదాబాద్, సెప్టెంబర్ 12 : మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు గురువారం అవయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నోట్‌బుక్స్ అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ సురేశ్‌కుమార్, దూబే, శ్రీకాంత్ పాల్గొని ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన గుర్రం సుస్మిత(ఎంపీసీ)కు ఐదు వేల రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత పదవులు అలంకరించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముంపు సమస్యను పరిష్కరిస్తా..



వివేకానందనగర్, సహారాస్టేట్స్ కాలనీల మధ్య వరద ముంపు సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 12: డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, సహారాస్టేట్స్ కాలనీల మధ్య ఏర్పడుతున్న వరద ముంపు సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. వరద నీటి ముంపు సమస్యపై గురువారం ఇరు కాలనీ వాసుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి ముంపు ప్రదేశానికి చేరుకుని సమస్యను పరిశీలించారు. అనంతరం సహారాస్టేట్స్ కాలనీ, వివేకానందనగర్ కాలనీవాసులతో సమావేశమయ్యారు. సమస్య తీవ్రతను జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంవత్సరాలుగా ఇరు కాలనీల మధ్య నెలకొన్న వరద ముంపు సమస్యను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వివేకానందనగర్ కాలనీ నుంచి సహారాస్టేట్స్ కాలనీలోకి వెళ్తున్న వరదనీటిని దారి మళ్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడు ఆత్మహత్య

మృతిచెందిన పురందాస్ (ఫైల్)

కందుకూరు, సెప్టెంబర్ 12 : మండలంలోని మురళీనగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కందుకూరు సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మురళీనగర్‌కు చెందిన ముడావత్ పురందాస్(32)కు అదే గ్రామానికి చెందిన మహిళతో పరిచయం ఏర్పడింది. ఒకరినొకరు ఇష్టపడ్డారు. కొంత కాలం తర్వాత వారి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరిగాయి. దాంతో సదరు మహిళ పురందాస్ అన్న శంకర్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. మీ తమ్ముడిని తీసుకురాకుంటే మీ ఇంటి ముందు నా పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. వెంటనే శంకర్ తన తమ్ముడు పురందాస్‌కు ఫోన్ చేసి ప్రశ్నించాడు. అలాంటిది ఏమీ లేదని చెప్పిన పురందాస్ ఈనెల 7న రాత్రి గణేశ్ వినాయకుడి వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి అన్నకు ఫోన్లో మెసేజ్ పెట్టి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతదేహానికి ఉస్మానియా ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గోల్నాక, సెప్టెంబర్ 12 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి అన్నారు. గురువారం అంబర్‌పేట పీటీసీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ' రోడ్డు ప్రమాదాలు.. నివారణ ' పై అవగాహన కార్యక్రమంలో మధుకర్ స్వామి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒ క్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రా ఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

బొజ్జ గణపయ్యకు విశేష పూజలు

- **బాలాపూర్ గణనాథుడికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూజలు**

బాలాపూర్ గణనాథుడికి పూజలు చేస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట, సెప్టెంబర్ 12 : బాలాపూర్ గణనాథుడిని గురువారం రాత్రి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లె నిరంజన్‌రెడ్డి మంత్రులను ఘనంగా సత్కరించి లడ్డూను అందజేశారు. బాలాపూర్ గణనాథునితోపాటు బడంగ్‌పేట గణనాథుడిని మంత్రులు దర్శించుకున్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు : మండలంలోని కొత్తగూడ గ్రామంలో వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ సాధ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వినాయకుడికి పూజలు నిర్వహించారు. రాత్రి సమయాల్లో భజనలు, కోలాటాలు, బతుకమ్మ ఆడుతున్నారు.

కందుకూరు : కొత్తగూడలో పూజలు నిర్వహిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులు

అదేవిధంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సౌడపు వెంకటయ్యగౌడ్, కుమారులు శేఖర్‌గౌడ్,బాలక్రిష్ణాగౌడ్ అన్నదానం చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాజీ సర్పంచ్‌లు సాధ మల్లారెడ్డి, మాధవరెడ్డి, యాదయ్య, మాజీ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డిని సన్మాంచి జ్ఞాపికలు అందజేశారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మిక చింతన అభినందనీయం

చంపాపేట : చిన్నారుల్లో ఆధ్యాత్మిక చింతన అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధిలోని ధర్మపురి కాలనీలో చిన్నారులు సతిల్లీ, శ్రేయస్ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి మండపాన్ని గురువారం కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో యశ్వంత్‌రాజ్, భగవంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట : ధర్మపురికాలనీలో చిన్నారులు ప్రతిష్ఠించిన మట్టి గణపతికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



మన్సూరాబాద్ : సీఎస్ఆర్ కాలనీలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి

నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

మన్సూరాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధి సీఎస్ఆర్ కాలనీ, సహారాస్టేట్స్‌కాలనీ, బాల్‌రెడ్డినగర్‌లో నెలకొల్పిన వినాయకులను మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు విఠల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగరాజు, నర్సింహాగౌడ్, సీఎస్ఆర్ కాలనీ అధ్యక్షుడు స్వామిగౌడ్, సభ్యులు వెంకటేశ్‌గౌడ్, యాదాచారి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : శివగంగా కాలనీలో వినాయక మండపంలో గణేశ్ పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్ తదితరులు

భక్తిశ్రద్ధలతో మూలమంత్ర హోమం, లక్ష్మీకుబేర పూజ

మలక్‌పేట, సెప్టెంబర్ 12 : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-రంగారెడ్డి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం గణపతి మూల మంత్ర హోమం, లక్ష్మీ కుబేర పూజ నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ పూరే లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలకు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోమ కలశాన్ని వేలం వేయగా రూ.36 వేలకు మలిపెద్ది శ్రీనివాస్ దక్కించుకున్నాడు. లక్ష్మీ కుబేర పూజా కలశంను వరగంటి జయరాములు రూ. 30 వేలకు దక్కించుకున్నాడు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ దయానంద్‌ను, దామోదర్ గుప్తాను ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికలను అందజేశారు. పూజల్లో హైదరాబాద్-రంగారెడ్డి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు పొద్దుటూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి రామనాథం, కోశాధికారి ఆమేటి శ్రీనివాస్, సభ్యులు అంజయ్య, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోడుప్పల్, సెప్టంబర్ 12: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. గురువారం చెంగిచర్లలో పట్ట ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, పద్మారెడ్డి, జంగయ్య యాదవ్, సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ దేవేందర్ నగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు అరుణ్‌కుమార్‌కు వీల్‌చైర్ అందజేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తూంకుంట విద్యార్థులు

శామీర్‌పేట, సెప్టెంబర్ 12: 34వ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో వసంతకుమారి, పీడీ గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గురువారం వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీ గ్రౌండ్‌లో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 34వ రాష్ట్ర స్థాయి పోటీలకు రంగారెడ్డి జిల్లా జట్టు తరపున తూంకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులైన జి.సాయి, ఉదయ్‌కిరణ్, అనిల్, హేమంతరావు బాలుర విభాగంలో, అలేఖ్య, మౌనిక బాలికల విభాగంలో ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో మెరుగ్గా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులను అభినందిస్తున్న పీడీ సత్తిరెడ్డి